# స్వార్థం

"అన్నయ్య ఇంత స్వార్థపరు డనుకోలేదమ్మా! నవమాసాలు మోసి, కని, పెంచినతల్లి ననయినా లేకుండా....నా మాట విని నాతో వచ్చేయమ్మా!"

నోటినిండుగా నవ్వింది మహాలక్ష్మి. జీవితాన్ని కాచి, వడబోసిన కఠిన సత్యాలు, అనుభవం నేర్పిన గుణపాఠాలు, మేధ దర్శించిన అగాధాలు, ఆత్మీయుల ఆంతర్యాల అవతలిగట్లు, మానవ నైజపు నిమ్నోన్నతాలు—అలలు అలలుగా, తెరలు తెరలుగా ఒరిసి పయనించి కలిసిపోయేయి ఆ హాసరేఖలో.

ఆ నవ్వు ఆనంద సమ్మిళతమో. విషాదభరితమో తెలుసుకోవడం కష్టమే. దానిని వ్యాఖ్యానించగల తాహతు మహాలక్ష్మికి మాత్రమే ఉంది.

తల్లి నవ్వుతో తహతహలాడిపోయింది జానకి. 'అమ్మకు మతి చలించలేదు కదా' అని భయపడింది.

దిగంతాలవరకు వ్యాపించబోయే నవ్వును దిగమింగింది మహాలక్ష్మి. ముఖాన గాంభీర్యం, పెదవుల దరహాసం, మాటలలో లాలిత్యం ఉట్టిపడగా: "పిచ్చితల్లీ! స్వార్థంలేని దెవరికమ్మా!" అన్నాది.

"అమ్మా!" బాధగా అరిచింది జానకి. హృదయంలో జ్వాలాముఖి. కన్నులలో జలభాండం బద్దలయింది. మహా సాగరపు పెల్లువ చెలియలి

కట్టదాటి హుంకరించింది. అశనిపాతపు తాకిడికి అవని కంపించింది. తన్ను కన్నతల్లి, పెంచి పెద్దచేసిన తల్లి, బిడ్డ శ్రేయస్సుకోసం తన సర్వస్వం ధారపోయ వెరవని తల్లి—తన బిడ్డనే శంకించింది. స్వార్థ చింతనతోటే ఆమె తన్నాహ్వానిస్తున్నాదని అపోహపడింది.

జానకి తల తిరిగిపోయింది. అనంతాకాశంలో తేజోరాశియై ప్రకాశిస్తున్న ప్రచండ మార్తాండుని, వేయి పొరల కారుమేఘం కాటువేసింది. నలు క్కుల చిమ్మచీకటి. మన్ను, మిన్ను కానరాని మహా తపస్సు. అజ్ఞాని మనస్సులాటి అంధకారం. అందులో జానకి. అమ్మను నమ్మించలేని జానకి కాదు, కాదు-తనను తనే నమ్మించుకోలేని జానకి. తనది నిస్స్వార్థ ప్రేమ అని నిశ్చయపరచుకోలేని జానకి.

"జానకీ!" ఆత్మీయమైన అమ్మ పిలుపు. "నేను ఏ ఒక్కరినీ ఉద్దేశించి అన్నమాట కాదమ్మా! ఇది మానవ నైజం. కొన్ని మంచి చెడుల సంపుటమే మానవ జీవితం. అంతా మంచి మాత్రమే ఉండి, చెడు సోకని వారుంటే, వారికి మానవత్వంలేదు. మిగిలింది దైవత్వం మాత్రమే.

"ఈ నెరిసిన కురులలో, వడలిన యవ్వనంలో, నెన్నుదుటి ముడతలలో నీ కేమీ కనిపించనేలేదా, జానకీ! ఇంతదూరం వయసుతో కలిసి పయనించిన అమ్మజీవితంలో అనుభవాలే లేవా?

"స్వార్థం అంటే మహా పాపంగా భావించి; అది అవహించినవానిని అస్పృశ్యుడుగా తలచి, అట్టివారిని నిందించి, తమ స్వార్థరాహిత్యాన్ని తెలుపుకొని సంతోషిస్తారు కొందరు తరిచి చూస్తే ప్రతి జీవిలోనూ స్వార్థం కొద్దో, గొప్పో ఉండక మానదు. తగుమాత్రం స్వార్థం హానికారకం కానేరదు. అది హద్దులుమీరి విజృంభిస్తేనే, దాని మనుగడకు ఇతరుల ధనమాన ప్రాణాలను బలిగొనజూస్తేనే వస్తుంది చిక్కు.

"ఎవరివారికివారే, వెనుదిరిగి చూసుకొంటే...."

* * *

"అమ్మా, పాప కేతాయిలం పెట్టేదమ్మా? చిన్నదా, పెద్దదా?"

"పాప నీకంటె చిన్నది కదా? దానికి ఏది కావాలంటే అది ఇచ్చేయి. రెండవది నీకు. పాప నేడిపించకేం" అన్నాది అమ్మ.

తాయిలాలు రెండూ రెండు చేతుల్లో ఉన్నాయి. చూపులు పెద్దదాని వైపే మొగ్గుగా ఉన్నాయి.

"అమ్మ ఎప్పుడూ ఇంతే. పాప నాకన్నా చిన్నది కదా? అది ఎప్పుడూ పెద్ద తాయిలమే కావాలంటుంది. చిన్నపిల్లలకు పెద్ద తాయిలం ఎందుకు? ఎంచక్కా చిన్న తాయిలం, చిన్నవోరు — ఎంత బాగుం టుంది? అసలు ఈ పెద్దతాయిలం పాప నోరు పట్టక గొంతుకడ్డుపడితే? చిన్నపాపకు అంత పెద్దది ఎందు కిచ్చావని నాన్న నన్ను తన్నుతారు. అమ్మ కేం! అన్నీ అలానే చెప్తుంది."

చెల్లెలిపై అభిమానం, నాన్న తన్నుతారేమో అన్న భయం నా చేత అలా చేయించేయని అప్పట్లో నమ్మగలిగేనా? ఇప్పుడు తలుచు కొంటే....

* * *

చిన్నతనంలో ఉగ్గు పాలతో కలిసి ఉదరంలో ప్రవేశించిన స్వార్థం, బిడ్డ పెద్దదవుతున్నకొద్దీ, తనూ పెరిగి పెద్దదై శాఖలు, పలి వలుగా, చిత్ర విచిత్రాలుగా రూపొందుతుంది దాని నామరూపాలు అనం తం. అప్పచెల్లెళ్ళమధ్య, ఆలుమగలమధ్య, తల్లీ బిడ్డలమధ్య, స్నేహితుల మధ్య—ఇక్కడ అక్కడ అనే మాటేమిటి? ఎక్కడ చూసినా అదే. దానినటనా విన్యాసాలను పరికించి చూస్తే, ఎవరికైనా, 'దాసోహం' అనక తప్పదు.

చిన్నాన్న కూతురు సరళా, నేనూ ఒకే క్లాసు చదువుతూండే వాళ్ళం. సరళ స్వతహాగా తెలివయింది. కష్టించి చదివే స్వభావం కలది. స్కూలులో చెప్పిన పాఠాలకు ఎప్పటికప్పుడు నోట్సు వ్రాసుకునేది.

సరళ మూలంగా నా కెప్పుడూ ఇంట్లో చివాట్లు తగులుతూండేవి. "తోటిపిల్ల సరళనిచూసి నేర్చుకోరాదూ? ఎంత చక్కగా చదువుకొంటు న్నాది" అనేవారు అమ్మ, నాన్న.

పరీక్షలు పదిరోజులున్నాయనగా, పక్కింటి సరసు, నేను బొమ్మలపెళ్ళి మొదలుపెట్టేము. అమ్మా నాన్నల కన్ను చాటేసి ఆటల కవి తోటలోకి పరుగుతీసేవాళ్ళం. ఆటలు, పాటలు అంటే ఆశపడని ఆడపిల్లలు ఎవరుంటారు? ఒకటి, రెండు రోజులు మనసు బిగపట్టు కొన్నా, ఆఖరికి బొమ్మలపెళ్ళి వినోదాలలో పాలొనకుండా ఉండలేకు పోయింది సరళ.

అయిదురోజులు పెళ్ళి, మూడు రోజులు మనుగుడుపులు దివ్యంగా జరిగిపోయేయి. సరళ నోట్సు పుస్తకాలలో కాగితాలు పప్పన్నాల విస్తళ్ళు క్రింద కైంకర్యమయిపోయేయి.

టేబిలు ముందు కూర్చుని 'బావురు' మన్నాది సరళ.

"బాగుందమ్మా, బాగుంది! నీ నోట్సులని మాకేం తెలుసు? పెళ్ళే.... పెళ్ళి. ఆ హడావిడిలో అవి నీవి, ఇవి మావి అని చూసేమా? మా పుస్తకాలు చించిపోసేము. నీ దొక్కటే కాదు" అన్నాము సరుసు, నేను ఏక కంఠంతో.

ఇదంతా ముందు నిర్ణయించుకొనే ఈ పెళ్ళికి దిగేమా? అంటే, అంటే ఇప్పుడు చెప్పడం కష్టం. బుద్ధిపూర్వకంగా అలా చేద్దా మనుకోకపోయినా, ఏదో అజ్ఞాత శక్తి—సరళ మంచి మార్కులతో పాసవుతుందన్న అసూయకా వచ్చు- మాచే చేయించిందా అనిపిస్తుంది. అంతమాత్రంచేత సరళ పరీక్ష పోనూలేదు; మా అత్తెసరు మార్కులు పెరగనూ లేదు. అది అంతే.

*          *

కన్యాదాన ఫలితాన్ని అందుకొని, తృప్తిగా ముందు ప్రయాణం సాగించేరు పితృదేవతలు.

"పుట్టిన ఇంటికి, నువ్వు మెట్టిన ఇంటికి ఖ్యాతి తేవమ్మా" అన్నారు బంధుజనులు.

"అత్తమామల మనసెరిగి, మన్ననతో మసలుకోవమ్మా" అని సుద్దులు నేర్పింది మాతృమూర్తి.

"ఇన్నాళ్ళు పెంచి, పెద్దచేసిన, నిన్ను ఒక అయ్యచేతిలో పెట్టి కళ్ళొత్తుకోవడమే మాకు మిగిలింది. భగవంతుడు నీకు మేలు చెయ్యాలమ్మా" అని ఆశీర్వదించేరు పితృపాదులు.

సరస విరసాలతో మగని వలచి, వలపించుకోగల మెలకువలు బోధించేరు నెచ్చెలులు.

తమబిడలు సుఖసంతోషాలతో జీవించాలని, వారి జీవితాలు మూడు పువ్వులకు ఆరుకాయలుగా అభివృద్ధి నొందాలన్న తల్లిదండ్రుల తపనలో, తమ ఇంటి ఆడపడుచు తను తిని ఒకరికి పెట్టగల తాహతులో ఉండాలన్న బంధుజనుల ఆకాంక్షలో, తమతో ఆడిపాడిన ప్రియసఖి వైవాహిక జీవితం వసంత సమీరంలా, మకరంద పరాగంలా హాయిగా, తీయగా సాగిపోవాలనే చెలుల ఆపేక్షలో అసహజ మేముంది? అందులోనూ శుభ చింతన తప్ప, వారి కొరిగే దేముంటుంది?

* * *

ఆనందధామంలా ఉన్న అత్తింట అడుగు పెట్టేను. వైవాహిక జీవనంలో ఎన్ని సుఖసంతోషాలను మనిషి ఊహించగలడో, వాటి నన్నిటిని నా ఒడిలో ఒలకబోసేడు విధాత. వాటిని భద్రపరచుకోవడమే నా వంతు.

అత్తమామల ఆదరంలో, పతిదేవుని ప్రేమానురాగాలలో రాత్రిం

బివళ్ళన్న భేదమే తెలియరాలేదు. ఎన్ని వసంతాలు వెల్లివిరిసేయో ఎన్ని శరజ్జ్యోత్స్నలు ప్రకాశించేయో ఆనాడు తెలియనేలేదు.

ఈనాడు వాటిని గురించి కాలపు విలువకట్టడంలో అర్థం అంత కన్నా లేదు. గడిచిన మధురానుభూతుల పరిపక్వ ఫలాన్ని అందుకున్నాక ఆ కాలంతో పని ఏముంటుంది?

చిన్నారి మధు చిలిపి కన్నులలో చూడని ఆనందమే లేదు. వచ్చీ రాని మాటలతో, తచ్చాడి పడే నడకలతో, జిలిబిలి పలుకులతో, పలక రింపు నవ్వులతో స్వర్గాన్నే సృష్టించేడా గృహంలో. కాలానికే కళ్ళెం తగిలించేడు.

ఆ మత్తునుండి కళ్ళు తెరవకముందే గర్భంలో శిశురోనద.... "వస్నీ అనంత విశ్వంలోకి రానీవమ్మా!" అని. "అది ఎవరితరం, పాపా! కాలం కలిసి వచ్చేదాకా ఓపిక పట్టు" అన్నదే నా జబాబు.

* * *

ఆనంద ధామంలో ఆధ్యాత్మిక జ్యోతిని వెలిగింప అవతరించేరు చిదానందస్వాములవారు. అత్తమామల పరలోకచింతన అధికమయింది.

స్వాములవారి హిత బోధనలతో, స్మృతి పురాణేతిహాసాలతో, భక్తి భజనలతో దేవళమే అయింది గృహం. వచ్చిపోయే భక్త సమూహానికి హద్దేలేదు. వారిని సత్కరింప నియమితులయిన పతిదేవుల కార్య కలాపాలకు అంతేలేదు.

నిస్పృహాయంగా కళ్ళు తేలవేసుకు చూడడమే నా వంతు అయింది. స్వాములవారి రూపంలో వచ్చిన ఏదోశక్తి, నా నుండి నా ఇంటిని, నా ఆనందాన్ని, నా ఆత్మీయులను వేరుచేస్తున్నట్లు బాధపడ సాగేను.

భగవద్దత్తమయిన ఈ నిక్షేపాన్ని నా నుండి ఎవరో కొల్లగొడుతూన్నట్లు హడిలిపోయేను. 'గుప్పెటనున్న ధనాన్ని గుప్తపరచడం ఎ

మంత కష్టం!' అనుకొంటాము. ఒక్కొక్క సమయంలో అదీ కష్టమే అవుతుంది. సర్వకాల సర్వావస్థలలో ఆ విధి రక్షణకే ప్రాముఖ్య మిస్తాము. పైకి ధనపు రాసులు చెక్కుచెదరకుండానే అడుగులు దొలిచే పురుగులు ఉంటాయని తెలుసుకోలేకపోతాము.

స్వాములవారి గీతా పఠనాన్ని అర్థ నిమీలిత నేత్రాలతో అస్వాదిస్తున్న అత్తమామలు ఆ పదజాలపు లోతుల నరయ ఏకాగ్ర చిత్తులయినవారి తనయుడు నా నిస్సహాయ స్థితిని గమనించనేలేదు.

"అనిత్యమగు దేహమును, దత్పరివారంబగు పుత్రకళత్రాదులను, గృహక్షేత్ర ధనాదులను సత్యంబులని భావించు జనుడు, తద్భావనంజేసి యేయే జన్మంబు లెత్తిన నా యా జన్మంబుల నెల్ల దదీయ సౌఖ్యములను గాంచనేరక, అట్లుండియు వాటిని విడువనేరక దుఃఖముల పాలగుచున్నాడు. మహాత్ములు అట్లుగాక, జ్ఞానముపార్జనకొరకు ఈ సంసారమును తృణప్రాయముగా త్యజించి...."

ఇలా సాగుతూండేవి స్వాములవారి బోధనలు. ఆ జ్ఞానసుధలో భక్తులంతా మునక లాడేవారు. అందరినీ అంతగా ఆకర్షించిన ఆ వాగ్ధాటి, తేజం నాకు భయావహం కాసాగేయి.

*　　*　　■　■

స్వాములవారిని అంపకం పెట్టనేగిన అత్తమామలు తిరిగివచ్చేరు.
"అబ్బాయి ఏడమ్మా?" అది వారి మొదటి ప్రశ్న.
"మీతో రాలేదా?" హృదయగత భయాల ఆవేదన.
"మా కన్నా ముందుగా వచ్చేసేడే!"
వారు రాలేదు.
విందు చూలాలయిన భార్య, ముద్దు పలుకుల చిన్నారి తనయుడు,

తమ ప్రాణంకన్న మిన్నగా చూసుకొనే తలిదండ్రులు—వీరెవరూ వారిని రప్పించలేకపోయేరు.

అనుమానం ఉన్న చోటునల్లా గాలించేము. అగపడినవారి కందరికీ తెలియజేసేము పత్రికలలో విజ్ఞాపనలు బంధుమిత్రులకు జాబులు వెళ్ళేయి. వెదకని పుణ్యక్షేత్రం లేదు. దర్శించని ఆశ్రమంలేదు. పరికించని జనస్థానం లేదు. అన్నీ వ్యర్థమేఅయేయి. "అదిగో, ఆ సన్యాసితో ఉన్నారు; ఇదిగో ఈ ఆశ్రమంలో ఉన్నా" రన్న వదంతులకు ఊగులాడిన హృదయం, వారి రాక చూచి, చూచి కాయలు కాచిన కనులూ నిస్తేజమయేయి. కాని, వారు తిరిగి రానేలేదు.

"నిన్ను విడిచి స్వర్గానికి రమ్మన్నా పోను, లక్ష్మీ" అనేవారు.

"ఈ జీవితాలు జంటగా, మానవత్వపు పంటగా ఇలానే సాగిపోవాలి. ఇహంలో సుఖించలేనివాడు, పరంకోసం పాకులాడతాడు. నాకు ఇహ పర సౌఖ్యాలు రెండూ ఈ జీవితంలోనే దొరకుతూంటే వీటిని కాదని ఎక్కడికిపోతాను? నిన్ను సుఖపెట్టి, నీ ఆనందంలో భాగం పంచుకోవడం కన్నా కోరదగింది నాకేముంది?

"మధు, నువ్వు నా రెండునేత్రాలు. అమ్మా, నాన్నా నా జీవిత మార్గదర్శకులు. మీ అందరి సౌఖ్యమే నేను కోరేది. మీ ఆనందంకోసం ఏదైనా చేస్తాను, లక్ష్మీ! నా జీవితాన్ని పణంగా ఒడ్డి మిమ్మల్ని సంతోషపెడతాను" అనేవారు.

జీవితాన్ని నందనవనంగా మారుస్తాననే భర్త, ప్రపంచంలోని ఆనందాన్నంతా నీ పరం చేస్తాననే భర్త; బ్రతుకులో, చావులో నీ సరసన నిలుస్తాననే భర్త; నీనుండి వేరుగా నాకు జీవితమే లేదనే భర్త—జీవిత ప్రాంగణంలో కాలు మోపి మెాపకముందే "నా దారి వేరు. నీ దారి నీవు చూసుకో" అని తప్పుకొంటే ఆ స్త్రీ గతేం కాను

ఆ పురుషుని ఏమనాలి?

తన శ్రేయస్సు మాత్రమే చూసుకొనే స్వార్థపరుడనాలా? తాను నమ్మిన ఆశయానికి సర్వం త్యజించిన మహాత్ముడనాలా? పిచ్చినమ్మకాలతో పండువంటి జీవితాన్ని పాడుచేసుకొన్న బుద్ధిహీను డనాలా? తన్ను నమ్ముకొన్న తల్లిదండ్రులను, భార్యాబిడలను నిర్దాక్షిణ్యంగా నీట ముంచిన కఠినాత్ము డనాలా?

ఎవరేమనుకొన్నా తన్ను కాదన్నట్లు, తనమార్గ మేదో తాను చూసుకొని, తన గమ్యాన్ని చేరుకో పయనించే ఆ మానవుని త్యాగంలో మాత్రం స్వార్థం లేదా?

* * *

బంధుజనుల పరామర్శలు, ఆత్మీయుల ఆక్రోశాలు అలవాట్లుగా మారే యీ రోజులలో.

"చంటిపిల్లలతో ఒంటరిగా ఏముంటావు? మా ఇంటికి వచ్చి వుండు. నీ పిల్లలు పెరిగి పెద్దవారయేక నీ యింట నిన్ను దింపుతాము" అన్నారు అన్నా వదినలు.

నిజమే. ఒంటరిగా ఉండడం నా కెంత అవసరమో నేను వారింటికి రావడం వదినకు అంత అవసరం. అమ్మ పోయినతరువాత ఈ ఏటా, ఆ ఏటా పుటుకువస్తున్న పిల్లల సందడికి తట్టుకోలేక నాలాటి చెయ్యి సహాయంకోసం ఎంతగానో చూస్తున్నాది వదిన. డబ్బుతోవస్తున్న చెల్లెలిని ఆదరించని అన్నగారిని అవివేకి అనకతప్పదు. అంతమాత్రంచేత వారి అభిమానాన్ని శంకించడం కాదు. ఎవరి ఊహలు వారివి.

"కొడుకైనా, కోడలయినా నువ్వేగా మాకు మిగిలింది? ఈ ఇంట నీ మాట కాదన్న దెప్పుడమ్మా? నీ కెలా బాగుందని తోస్తే అలాచేయి" అన్నారు అత్తమామలు.

పిల్లలు ఏదో ఉద్ధరిస్తారు అనుకొని, అర్థం, ప్రాణం అర్పించి పెంచి పెద్దచేస్తే, అక్కరకొచ్చి ఆదుకొనే సమయానికి అటుముఖం తిప్పితే వారి గతేంకాను? లేని కొడుకులేకపోగా ఉన్నకోడలిని ఎడం చేసుకొంటే, వారికి ఆ మాత్రం చేయూత నిచ్చేవారు ఎవరు? పుట్టింటి కేగిన కోడలు అత్తమామల అవసరాలు చూస్తుందా? ఆదరిస్తుందా?

అందరిలో ఉన్న స్వార్థం నాలో మాత్రం లేకపోతుందా? నా ఇద్దరూ పిల్లలను అన్నగారి పదిమందితో కలిపి పెంచితే, వారి ముచ్చట్లు తీర్చ గలనా? అందరి అవసరాలకు ఆస్తి కాస్తా హరించిపోతే, కడకు నా పిల్ల లకు మిగిలేది ఏముంటుంది? అంత్య నిష్ఠూర్యంకన్న ఆది నిష్ఠూర్యమే మేలంటారు.

"పెద్దవారు అత్తమామ లున్నారు. వారిని విడిచి నే నెలా రాను, అన్నయ్యా? కొంతకాలం ఇలా సాగనీ" అన్నాను.

*　　*　　*

మామగారి మరణం మానబారుతున్న పుండపై కారం జల్లిన విధమే అయింది. దశరథ మహారాజులా కొడుకుకోసం తపించి ప్రాణం విడిచే దన్నారంతా. కన్నకొడుకు గృహ త్యాగం, తాళికట్టిన భర్తమరణం అత్తగారిని కుంగదేసేయి.

అనుభవాల ఆలంబనతో కాలాన్ని మెల్లగా నెట్టుకు రాగలుగు తున్నాదా వృద్ధనారి.

ఎంతలేసి గాయాలనూ మాన్పగలిగే ఔషధం కాలంలో ఉంది. వెనుతిరిగి చూడకుండా ముందుకే పయనించే జీవితాలలో భవిష్యత్తుకే ఎక్కువ ప్రాధాన్యం.

"అమ్మాయీ, లక్ష్మీ! పిల్లకి పన్నెండేళ్ళు నిండేయికదా? లక్ష ణంగా పెళ్ళిచేసేయరాదుటే" అన్నారు అత్తగారు.

"ఇప్పుడొచ్చిన తొందరేముంది, అత్తయ్యా! చదువుకొంటున్నాడి కదా! వీలుచూసుకు చేద్దాము" అన్నాను.

"ఏమి చదువులోనమ్మా; ఏ ఈడు కా ముచ్చట బాగుంటుంది కాని, పిల్లల తల్లుల్లా పాతికేళ్ళు వచ్చేక పెళ్ళేమిటో" అన్నారు ఆవిడ.

ఆవిడ మనసులోని ఉద్దేశం అద్దంలోని బొమ్మలా కనిపిస్తున్నాది. మొదటిది, మామగారుపోయిన ఏడాదిలో జానకి పెళ్ళిచేస్తే కన్యాదాన ఫలితం ఆయనకు చెందుతుంది. రెండవది, ఉబ్బసం వ్యాధితో బాధపడు తున్న ఆవిడ కన్నుమూయకముందే మనుమరాలి పెళ్ళిజరిగితే, ఆ వేడుక కాస్తా చూసి, ఆ పైన భగవంతుడు అనుగ్రహిస్తే దాని కడుపున కాచిన కాయను చూసి తాఫీగా కన్ను మూయవచ్చు.

"మీరేం కంగారుపడకండి, అత్తయ్యా! జానకి పెళ్ళి మీరు తప్ప కుండా చూస్తారు. ఒకటి రెండేళ్ళలో మంచి సంబంధం చూసి చేసేద్దాము" అన్నాను.

• • •

జానకి అత్తవారింటికి వెళ్ళిపోయిన దగ్గరినుంచి ఇంట్లో అంతా వెలితే. మధు దగ్గరినుంచి ఉత్తరం వచ్చినరోజున పండుగ. ఆ ఉత్త రాన్ని తిప్పితిప్పి ఎన్నిసార్లు చదివినా అంతే—'నేను క్షేమం. బాగా చదువుతున్నాను. నాన్నమ్మ కెలా ఉంది? నీ ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకో.' ఇంతకన్నా వ్రాసేందుకు మరేంలేదు.

నిజమే. జీవితంలో అప్పుడే అడుగు పెట్టనున్న నవ హృదయం, తన ఆలోచనలను, ఆనందాన్ని పంచుకుందుకు సరియైన జోడీ కావాలం టుంది, జీవితంలో ఎదురుచూడని దెబ్బలుతిని, ఉద్రేకాన్ని, ఉత్సాహాన్ని కోల్పోయిన ఈ తల్లికి వ్రాసేందుకు ఏముంటుంది?

మధు పెద్దవాడవుతున్నాడు. వాడి జీవితాన్ని ఇక వాడికి వదిలి

వేయాలి సాధ్యమయినంతత్వరలో పెళ్ళిచేసి ఓ ఇంటివాణ్ణి చేస్తే తన బాధ్యత తీరుతుంది. తల్లిగా తాను చేయగలిగింది చేసేనన్న తృప్తి తనకు మిగులుతుంది. దానితో తాను స్వర్గానికి చేరలేకపోవచ్చు. [స్వాములవారి వచనాల ప్రకారం). జనన మరణచక్రంలోపడి కొట్టుకోవచ్చు. అయినా తను చింతించదు. తన బిడ్డల భవిష్యత్తు బాగుపడింది. అది స్వార్థమే అయినా, మరేమయినా తనకు కావలసింది అదే తనకు అంతేచాలు.

బరువు బాధ్యతలు మోస్తానని అగ్నిసాక్షిగా ప్రమాణం చేసిన వారు, అతి నిర్దాక్షిణ్యంగా తమపాటుకు తమ్ము వదిలి, సర్వసంగ పరి త్యాగం చేసేమన్న అహంతో వెళ్ళిపోయేరు. అది పారమార్థిక కాంక్ష అయినంతమాత్రాన స్వార్థంకాదా? ఐహికమయిన తమ స్వార్థానికి ఇతరు లను బలిచేస్తే విరసించే సంఘం, ఈ స్వార్థాన్ని పూజిస్తుంది. చెయ్యెత్తి నమస్కరిస్తుంది. మహాత్ము డంటుంది.

• • • •

అత్తగారి మనసు ఎందుకో ఆరాటపడుతున్నాది.

"అమ్మాయీ లక్ష్మీ! మనం ఇద్దరం ఇక్కడ ఎందుకే? హాయిగా అబ్బాయి దగ్గరికి వెళ్ళిపోతే? పిల్లలులేని ఇల్లు నరకం అని ఊరికే అన్నారా పెద్దలు? నీ మానాన నీవు అలా మతిపోయిన దానిలాకూర్చుంటే నా హృదయం బద్దలవుతున్నాదనుకో" అన్నారు ఆవిడ.

అబ్బాయి దగ్గరకిపోతే అన్నీ కలిసిస్తాయి మనుమనిపై అభి మానంకన్నా, కాశికపై వృద్ధులకు ఉండే అభిమానం గొప్పది. కాటికి కాళ్ళు చాచుకొన్నవారు గంగాతీర నివాసం, విశ్వనాథ దర్శనంకన్న కోరే దేముంటుంది? భగవంతుడనుగ్రహించి అక్కడే కళ్ళుమూస్తే అంతకన్న పుణ్యం వేరేముంటుంది?

ఇద్దరం ఇక్కడ ఉండడంకన్నా అత్తగారన్నట్లు అబ్బాయి దగ్గరికి పోయిఉండడమే మంచిదిగా తోచింది నాకు కూడా.

• • • •

మనుమని పెళ్ళిచూసి కన్నుమూసింది నాయనమ్మ. కోడలు రావడంతో ఇల్లు కలకలాడింది. నవ్వులు, కేరింతలు, హాస పరిహాసాలతో ఇంట్లో జీవం మెదలసాగింది.

ఇరవై సంవత్సరాల నిర్జీవగృహం ప్రాణం పుంజుకున్నాది. బాధ్యతల బరువు ఒరిగిపోయింది. జరిగిపోయిన చరిత్రను మననం చేసుకొందుకు సమయం చిక్కింది. అంతకాలంగా ఘనీభవించిన హృదయం ద్రవించసాగింది.

ప్రాణంకన్న చిన్నగా ప్రేమించిన భర్తను వదిలి, వారి అతీగతీ తెలియని బాధను దిగమింగి, ఇంత మొండిగా ఎలా బ్రతకగలిగేనా-అనిపించింది వారు ఇల్లు వదిలిననాడే ఈ జీవితాన్ని ఎందుకు సమాప్తం చెయ్యలేకపోయేనా? అని నన్ను నేనే ప్రశ్నించుకొంటే దానికి దొరికిన సమాధానం ఒక్కటే. ఒకనాటి తమ అనురాగ ఫలాలయిన బిడ్డలను, గాలి ఎటు వీచితే అటుపోయే ఎండుటాకుల్లా విడిచిపెట్టలేకపోయింది. వారి జీవితాలు తీర్చిదిద్దిన బాటల్లో పయనించాలని ఆశించింది. ఇదంతా మీ అమ్మ స్వార్థం కాదంటావా, జానకీ!

ఈనాడు నీ అన్న నవ యవ్వన విలాసిని అయిన భార్యతో అమ్మకు కాస్త దూరంగా, స్వేచ్ఛగా, మనసుకు నచ్చినరీతిగా ఉందామని వేరుంటే ఇదొక్కటేనా స్వార్థం?

తల్లి గర్భం చీల్చుకుని ధరణిపై పడిన మానవుని మనుగడ స్వార్థంతోనే ఆరంభమయిందమ్మా! మనం గమనించవలసింది—అందు

లోని హెచ్చు తగ్గులను మాత్రమే — అన్నాది మహాలక్ష్మమ్మ ఓదార్పుగా.

తల్లి ఒడిలో తల దూర్చుకుని బావురు మన్నాది జానకి.

"జానకీ! బండికి వేళవుతున్నాది. త్వరగా తెమిలి రా" అంటూ ఎంతకూ బయటపడని భార్యను పిలుచుకుపోయే ఉద్దేశంతో హాలులో కాలుపెట్టిన అల్లుడు ఆ తల్లీ పిల్లల ముఖాలు చూచి తెల్లముఖం వేసేడు.

"పిచ్చి పిల్లా! మీరంతా ఉండగా నాకేం లోటమ్మా! క్షేమంగా వెళ్ళి లాభంగా రా" అని దీవించింది మహాలక్ష్మమ్మ చిరునవ్వుతో.

...౦...